# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం | 10 | నవంబర్ | 2024






**చీనీ టన్ను రూ.30 వేలు**

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



**కిలో టమాట రూ.23**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.16 ప్రకారం ధర పలికింది.




జిల్లాలో శనివారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### రీసెర్చ్ ప్రాజెక్ట్‌లకు సహకారం



సతీష్ రెడ్డిని సన్మానిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

**అనంతపురం:** జేఎన్‌టీయూ (ఏ)కు రీసెర్చ్ ప్రాజెక్ట్‌లు అందేలా సహకారం అందిస్తామని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రి మాజీ సలహాదారు డాక్టర్ జి. సతీష్ రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం పూర్వ విద్యార్థి అయిన సతీష్ రెడ్డి శనివారం వర్సిటీని సందర్శించారు. కాన్ఫరెన్స్ హాలులో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తానన్నారు. లేజర్స్, ఇమేజ్ ప్రాసెసింగ్, సైబర్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై గెస్ట్ లెక్చర్, ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేస్తానన్నారు. డీఆర్‌డీఓ నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ఓటీపీఆర్ఐ వీసీ ప్రొఫెసర్ ఓ దేవన్న, ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ప్రొఫెసర్ పి. సుజాత, ప్రొఫెసర్ కేవీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నలుగురు టీచర్లకు రాష్ట్రస్థాయి అవార్డులు

- ఈనెల 11న అవార్డుల ప్రదానోత్సవం
- సీఎం చేతుల మీదుగా పురస్కారాలు



చెన్నకృష్ణారెడ్డి



మహమ్మద్ యాసిన్



విజయ్‌కుమార్

**పుట్టపర్తి:** జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ప్రకటించే రాష్ట్రస్థాయి అవార్డులకు ఈసారి జిల్లా నుంచి నలుగురు టీచర్లు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం జాబితాను విడుదల చేసింది. బోధనలో వినూత్న పద్ధతులు, వృత్తిలో అంకితభావం, విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో తమదైన ఆలోచనా విధానంతో ప్రత్యేకంగా పేరు గాంచారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారందరికీ ఈ నెల 11న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు అవార్డులు అందజేస్తారు.

**ఉత్తమ గురువులు వీరే..**

- **చెన్నకృష్ణారెడ్డి:** ఈయన కొత్తచెరువు మండలం కేశాపురం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ గత జూన్‌లో పదవీ విరమణ పొందారు. చెన్నకృష్ణారెడ్డి స్వగ్రామం బుక్కపట్నం మండలం తరుగువాండ్లపల్లి. తన ఉద్యోగ జీవితంలో ఏ పాఠశాలలో పనిచేసినా ఆ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించారు. గ్రామస్తులు, సత్యసాయి భక్తుల సాయంతో రూ.లక్షలు ఖర్చు పెట్టి ఆయా పాఠశాలల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.
- **మహమ్మద్ యాసిన్ :** నల్లమాడ మండలం రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.
- **పూల విజయకుమార్:** గోరంట్ల ట్రైబల్ గురుకుల పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్నారు.
- **శిరీష:** ధర్మవరం ఏపీ మోడల్ స్కూల్‌లో గణిత ఉపాధ్యాయురాలి (టీజీటీ)గా పని చేస్తున్నారు.

# పోయాం... మోసం!




'మీకు భయం లేదు..నేనున్నా..మీకు తప్పక ప్రాధాన్యం ఉంటుంది. కష్టపడండి...అన్నీ నేను చూసుకుంటా' అంటూ గతంలో కూటమి నేతలకు హామీలిచ్చిన చంద్రబాబు కీలకమైన నామినేటెడ్ పోస్టుల్లో జిల్లా నేతలకు మొండిచేయి చూపారు. అనంతపురం జిల్లాలో ఇద్దరికి పోస్టులిచ్చినప్పటికీ జిల్లా నుంచి ఒక్కరికీ పదవి దక్కకపోవడంతో కూటమి పార్టీల నేతలంతా పోయాం.. మోసం అంటూ అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కూటమి నేతలకు చంద్రబాబు శఠగోపం
- నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు మొండిచేయి
- నమ్ముకుంటే నట్టేట ముంచాడని 'తమ్ముళ్ల' గుర్రు
- తమకు ప్రాధాన్యం ఇవ్వలేదని బీజేపీ, జనసేన నేతల ఆవేదన
- కూటమిలోని మూడు పార్టీల్లోనూ అసమ్మతి సెగలు
- మడకశిర, పెనుకొండ, ధర్మవరంలో భారీగా అసమ్మతి

సాక్షి, పుట్టపర్తి

**కూ**టమి నేతలకు సీఎం చంద్రబాబు షాక్ ఇచ్చారు. తాజాగా విడుదలైన నామినేటెడ్ పోస్టుల జాబితాలో జిల్లా నుంచి ఒక్కరంటే ఒక్కరికీ అవకాశం దక్కకపోవడంతో వారంతా గుర్రుగా ఉన్నారు. పార్టీని గెలిపిస్తే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని ఎన్నికల సమయంలో భరోసా ఇచ్చిన చంద్రబాబు... నామినేటెడ్ పదవుల్లో నట్టేట ముంచారని సీనియర్లంతా వాపోతున్నారు. పెనుకొండ, ధర్మవరం, మడకశిర నేతలంతా చంద్రబాబు తీరుపై మండిపడుతున్నారు. తమ కష్టంతో పార్టీని అధికారంలోకి తెస్తే...పీఠంపై కూర్చున్న చంద్రబాబు తమనే విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్లు గుమ్మరించి.. ఎన్నికల్లో పని చేస్తే.. నిలువునా మోసం చేశారని బాధపడుతున్నారు. నామినేటెడ్ పదవులు ఇస్తామని నమ్మబలికి.. ఇప్పుడు ఎలిమినేటెడ్ చేశారంటున్నారు.

**నిమ్మల కిష్టప్పకు షాక్..**

పెనుకొండ నియోజకవర్గంలో సీనియర్ టీడీపీ నేత, మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్ ఆశించారు. కానీ సవిత, పార్థసారథి పట్టుబట్టడంతో ఆ ఇద్దరికీ ఇచ్చి.. కిష్టప్పకు ప్రభుత్వం వచ్చాక న్యాయం చేస్తామని చంద్రబాబు, లోకేశ్ అప్పట్లో హామీ ఇచ్చారని సమాచారం. కానీ రెండో విడత నామినేటెడ్ పదవుల జాబితాలోనూ నిమ్మల కిష్టప్ప పేరు కనిపించలేదు. దీంతో ఆయన అధిష్టానంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక బీజేపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్ కూడా పెనుకొండకు చెందిన వారే. ఆయన కూడా నామినేటెడ్ పోస్టుపై గంపెడాశలు పెట్టుకున్నా...ఫలితం కనిపించలేదు. దీంతో మిత్రపక్షాలను చంద్రబాబు కనీసం పట్టించుకోవడం లేదని ఆయన వాపోతున్నారు. రెండో జాబితాలో కూడా పేరు లేకపోయే సరికి లోలోపల కుమిలిపోతున్నారు.

**ఈరన్న ఆశలు గల్లంతు..**

ఎన్నికల సమయంలో చంద్రబాబు తొలుత మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్‌కుమార్‌కు ఎమ్మెల్యే సీటు ఇచ్చారు. దీంతో ఈరన్న నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించి ఒక సెట్ నామినేషన్ కూడా దాఖలు చేశారు. అయితే ఆ తర్వాత టీడీపీ సీటును స్థానికేతరుడైన ఎంఎస్ రాజుకు ఇచ్చారు. ఆ సమయంలో ఈరన్న వర్గాన్ని బుజ్జగించిన చంద్రబాబు.. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఈరన్న నామినేటెడ్ పోస్టు కోసం ఎదురుచూస్తున్నారు. తనకు ఇవ్వకపోయినా ఫర్వాలేదు...కనీసం తన కుమారుడినైనా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అయినప్పటికీ దళితుడైన ఈరన్న విన్నపాన్ని చంద్రబాబు చెత్తబుట్టలో వేసినట్లు తెలుస్తోంది.

**సీటు త్యాగం చేసినా...**

బీజేపీ కోసం ధర్మవరం సీటు త్యాగం చేసిన పరిటాల శ్రీరామ్‌ను కూడా చంద్రబాబు పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. ఎన్నికల సమయంలో పరిటాల కుటుంబానికి ఏం చేసినా తక్కువే అంటూ చంద్రబాబు కార్యకర్తలతో పదే పదే చెప్పేవారు. దీంతో పరిటాల శ్రీరామ్‌కు కీలకమైన పోస్టు కట్టబెడతారని కేడర్ అంతా భావించింది. కానీ రెండు జాబితాల్లోనూ పరిటాల పేరు కనిపించలేదు. దీంతో టీడీపీ అధిష్టానం పరిటాల శ్రీరామ్‌కు ఇచ్చే విలువ ఏమిటో అర్థం అవుతోందంటూ టీడీపీ నేతలు చర్చించుకుంటున్నారు.

**మిత్రపక్షాలకూ మొండిచేయి..**

నామినేటెడ్ పోస్టుల్లో మిత్రపక్షాలకూ చంద్రబాబు మొండిచేయి చూపారు. జిల్లాలో జనసేనకు ఏకైక దిక్కుగా ఉన్న చిలకం మధుసూదన్‌రెడ్డికి నామినేటెడ్ పోస్టు పక్కా అంటూ కొంతకాలంగా ప్రచారం సాగినా...ఆయన పేరు రెండో జాబితాలోనూ కనిపించ లేదు. హిందూపురంలో గద్దం నాగరాజు, జేవీఎస్ కుమారుడు అనీల్ నామినేటెడ్ పదవులు ఆశించినా చంద్రబాబు వారి పేర్లను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదని సమాచారం. అదేవిధంగా పుట్టపర్తిలో బీసీ కోటాలో పీసీ గంగన్న, రామాంజనేయులు నామినేటెడ్ పదవి ఆశించారు. ఈ మేరకు పార్టీ పెద్దలను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరారు. కానీ వారి ఆశలూ నెరవేరలేదు. దీంతో జిల్లాలోని కూటమి నేతలంతా చంద్రబాబు తీరుపై గుర్రుగా ఉన్నారు. పార్టీకోసం కష్టపడ్డామని ఒకరు..చంద్రబాబు చెప్పాడని రూ.కోట్లు ఖర్చు చేశామని మరొకరు బాధపడిపోతున్నారు. ఎప్పుడైనా చంద్రబాబుకు తమ అవసరం తప్పదని అప్పుడు తామేంటో చూపుతామంటున్నారు.

**'గుండుమల'కు గుండుసున్నా..**

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆగస్టులో పింఛన్ల పంపిణీ కోసం సీఎం హోదాలో చంద్రబాబునాయుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి స్వగ్రామం గుండుమలకు వచ్చారు. దీంతో తిప్పేస్వామికి నామినేటెడ్ పదవి ఖాయమనే ప్రచారం బాగా జరిగింది. ఆయన పేరు తొలి జాబితాలోనే వస్తుందని జిల్లా నేతలంతా ఊహించారు. కానీ అప్పుడు ఆయనకు ఎలాంటి పదవి దక్కలేదు. కనీసం రెండో జాబితాలోనైనా పేరు రాకపోదా అని గుండుమల ఎదురుచూశారు. కానీ ఈసారీ ఆయనకు గుండుసున్నానే మిగిలింది. ఇప్పటికే గుండుమల నియోజకవర్గాన్ని శాసిస్తున్నారని, నామినేటెడ్ పోస్టు వస్తే ఆయన్ను తట్టుకోలేమన్న భావనతో స్థానిక ముఖ్య నాయకుడు అడ్డుపుల్ల వేసినట్లు టీడీపీలోని ఓ వర్గం చెబుతోంది. మరోవర్గం మాత్రం బీసీ వర్గాన్ని అణగదొక్కాలనే ఉద్దేశంతోనే గుండుమల తిప్పేస్వామికి పదవి ఇవ్వలేదని ఆరోపిస్తోంది.

**అందరికీ పంగనామాలు..**

ధర్మవరం నియోజకవర్గంలో కూటమిలోని మూడు పార్టీల్లో కీలక నేతలుగా వ్యవహరిస్తున్న వారిలో ఒక్కరికి కూడా నామినేటెడ్ పదవి దక్కలేదు. బీజేపీ తరఫున కోటి సూర్యప్రకాశ్‌బాబు, ఆదినారాయణ యాదవ్, జనసేన తరఫున చిలకం మధుసూదన్‌రెడ్డి, రెడ్డి సామాజిక వర్గం కోటాలో కుణుతూరు వేణుగోపాల్ రెడ్డి నామినేటెడ్ పదవి ఆశించారు. అయితే అందరికీ చుక్కెదురైంది. తొలి జాబితాలో మాజీ ఎమ్మెల్యే జయమ్మ కుమారుడు గోనుగుంట్ల విజయ్‌కుమార్‌కు ఓ పదవి కట్టబెట్టారు. కూటమి తరఫున ధర్మవరంలో విర్రవీగే నాయకులందరికీ చంద్రబాబు పంగనామాలు పెట్టారని ప్రచారం జరుగుతోంది.

## డ్రోన్ కెమెరాలతో పోలీస్ గస్తీ

- హిందూపురంలో నైట్‌వాచ్‌పై ప్రత్యేక దృష్టి
- గ్యాంగ్ రేప్ కేసులో మరింత లోతుగా విచారణ
- విలేకరుల సమావేశంలో ఎస్పీ రత్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

**హిందూపురం:** జిల్లాలోనే అతిపెద్ద పట్టణమైన హిందూపురంలో డ్రోన్ కెమెరాలతో గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. శనివారం ఆమె డీఎస్పీ మహేష్‌తో కలిసి స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందూపురంలో ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో సీసీ కెమెరా కమాండ్ సబ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందుకు అవసరమైన స్థలాన్ని, ఇతర సదుపాయాలపై అధికారులతో చర్చించామన్నారు. పట్టణంలో చోరీలు, అసాంఘిక కార్యక్రమాలు, స్పీడ్ డ్రైవింగ్, బైక్ విన్యాసాల కట్టడికి రాత్రి వేళల్లో పట్టణంలోని ప్రధాన వీధుల తోపాటు శివారు ప్రాంతాల్లో రెండు డ్రోన్ కెమెరా ద్వారా పోలీస్ గస్తీ ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే వ్యాపారులు, దుకాణదారులకు తెలియజేశామన్నారు. రాత్రి 10 గంటల వరకే దుకాణాలకు అనుమతి ఉంటుందన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. త్వరలోనే పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**పోలీసులు తప్పుచేసినా వదలను..**

పోలీసులు తప్పుచేసినా ఉపేక్షించేది లేదని ఎస్పీ రత్న తేల్చిచెప్పారు. ఇప్పటికే పలువురిపై వేటు వేశామన్నారు. హిందూపురం సబ్ డివిజన్‌లోని పోలీసుల పనితీరుపై ఇప్పటికే డీఎస్పీ, సీఐలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించామన్నారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డులోని ఇరిగేషన్ స్థలంలో పోలీసుశాఖకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించామని, అక్కడ డీఎస్పీ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.

**గ్యాంగ్‌రేప్ ఘటనపై లోతైన విచారణ..**

చిలమత్తూరు గ్యాంగ్‌రేప్ కేసుకు సంబంధించి మరింత లోతుగా విచారణ చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. బాధితుల నుంచి సేకరించిన నమూనాలను డీఎన్‌ఏ పరీక్షల నిమిత్తం పంపామని, రిపోర్ట్ రావాల్సి ఉందన్నారు. గంజాయి కేసులో మరో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. గంజాయి నేరస్తులపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచామన్నారు. సమావేశంలో సీఐలు రాజగోపాల్ నాయుడు, కరీముల్లా, ఆంజనేయులు, జనార్దన్ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- సోషల్ మీడియా పోస్టులపై అరెస్ట్ సరికాదు
- భావప్రకటన స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్
- అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టిన టీడీపీ కేడర్‌పైనా చర్యలు తీసుకోవాలని ఏఎస్పీకి వినతి



ఏఎస్పీ శ్రీనివాసులుతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

**పుట్టపర్తి టౌన్:** "కూటమి ప్రభుత్వం పరిపాలనలో పూర్తిగా విఫలమైంది..ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. దీన్ని ప్రశ్నించేవారి గొంతునొక్కుతోంది. అక్రమ అరెస్టులతో అమాయకులపై జులుం ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత, మంత్రి నారా లోకేష్ పోలీసులు కలిసి అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదన్న విషయం పాలకులు గుర్తించాలి. వారి మాటలు వింటూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్న పోలీసులూ గుర్తించాలి. రేపు మేము అధికారంలోకి వస్తే పరిస్థితి ఏమిటో ఆ పోలీసులూ ఆలోచించుకోవాలి" అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ హెచ్చరించారు. పార్టీ నేతలతో కలిసి శనివారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయానికి విచ్చేశారు. ఎస్పీ రత్న అందుబాటులో లేకపోవడంతో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులును కలిశారు. సోషల్ మీడియా పోస్టులపై వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు.. అసభ్యకర పోస్టులు సోషల్ మీడియాలో పెట్టిన కూటమి పార్టీల కార్యకర్తలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు టీడీపీ నేతలు సోషల్ మీడియాలో పోస్టు చేసిన వాటికి సంబంధించిన వివరాలను అందజేసి చర్యలు తీసుకోవాలని ఏఎస్పీని కోరారు.

**ప్రశ్నించడమే తప్పా?**

కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించడమే తప్పా అని ఉషశ్రీచరణ్ ప్రశ్నించారు. ఏఎస్పీని కలిసిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఐదు నెలల్లోనే రాష్ట్రాన్ని అరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చిందన్నారు. పరిపాలనలో సీఎం చంద్రబాబు, శాంతిభద్రతల విషయంలో హోంమంత్రి అనిత పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను టార్గెట్ చేసి పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం భావప్రకటన స్వేచ్ఛనూ హరిస్తోందన్నారు. పాలకుల ఆదేశాలతో పోలీసులు కదిరి, పెనుకొండ నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అర్ధరాత్రి సమయంలో ఎత్తుకొచ్చారని, కనీసం వారిని ఎక్కడ ఉంచారో కూడా చెప్పడం లేదన్నారు. అక్రమ అరెస్టులపై న్యాయ పోరాటం చేస్తామని, కార్యకర్తలందరినీ కాపాడుకుంటామన్నారు.

**ఆ పోస్టులు పెట్టిన వారినీ అరెస్టు చేయండి**

సోషల్ మీడియా పోస్టులపై చర్యలు తీసుకుంటున్న పోలీసులు... కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెట్టిన పోస్టులను కూడా పరిగణనలోకి తీసుకుని వారినీ అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మొదటగా వ్యక్తిత్వ హననానికి పాల్పడిన మంత్రి సవితను తొలుత అరెస్ట్ చేయాలన్నారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని, ఒక్కో పార్టీకి ఒకలా ఉండకూడదన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో కూటమి ప్రభుత్వానికి తప్పక బుద్ధిచెబుతారన్నారు. ఉషశ్రీచరణ్ వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

## కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ గల్లంతు!

**మడకశిర:** సీఎం చంద్రబాబు శనివారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల రెండో జాబితాలో కుంచిటి వక్కలిగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరు గల్లంతయ్యింది. ఈ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను గానీ, డైరెక్టర్లను గానీ నేటికీ ప్రకటించలేదు. దీంతో అసలు ఈ కార్పొరేషన్ ఉన్నట్టా? లేనట్టా? అని కుంచిటి వక్కలిగలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్రంలో ఇక్కడే అధికం:** కుంచిటి వక్కలిగలు రాష్ట్రంలోనే మడకశిర నియోజకవర్గంలో అధికంగా ఉన్నారు. దీంతో వారి సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి మడకశిర నియోజకవర్గ వాసులకే చైర్మన్, 10 డైరెక్టర్ పోస్టులు కట్టబెట్టారు. దీంతో వారంతా కుంచిటి వక్కలిగల సంక్షేమానికి పాటుపడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం కూడా ఈ కార్పొరేషన్‌ను కొనసాగిస్తుందన్న నమ్మకంతో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాండురంగప్ప, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, అమరాపురం మండల టీడీపీ కన్వీనర్ గణేష్ తదితరులు చైర్మన్ పదవి ఆశించారు. అలాగే డైరెక్టర్ల స్థానాలపై కూడా పలువురు ఆశలు పెట్టుకున్నారు. కానీ చంద్రబాబు నామినేటెడ్ పోస్టుల రెండో జాబితాలోనూ కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ ప్రస్తావన లేకపోడంతో నాయకులు తీవ్ర నిరాశకు గురయ్యారు.





## ఓం నమో నారసింహా



ఖాద్రీశుని దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- గోవింద నామస్మరణతో మార్మోగిన ఖాద్రీ ఆలయం

**కదిరి టౌన్:** కార్తీక శనివారం సందర్భంగా ఖాద్రీశుని దర్శనానికి భక్తులు భారీగా తరలివ రావడంతో నారసింహుని నామస్మరణతో కదిరి మార్మోగింది. ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు జిల్లాల నుంచే కాకుండా అటు తెలంగాణ, ఇటు కర్ణాటక, తమిళనాడు భక్తులు భారీగా తరలివచ్చి వసంతవల్లభుడికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. చాలా మంది తలనీలాలు సమర్పించారు. సాయంత్రం వేళ మహిళలు కార్తీక దీపాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఎంపీఈఓల డిప్యుటేషన్లు రద్దు

**అనంతపురం అగ్రికల్చర్:** మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ అసిస్టెంట్స్ (ఎంపీఈఓ) డెప్యుటేషన్లను రద్దు చేస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు వెళ్లిన 106 మంది ఎంపీఈఓలకు వెసులుబాటు కల్పించారు. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్ల రేషనలైజేషన్ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో డిప్యుటేషన్లను రద్దు చేశారు. వారందిరినీ రిలీవ్ చేయాలంటూ చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల జేడీఏలను ఆదేశించారు. అలాగే వారికి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో సర్దుబాటు చర్యలు చేపట్టాలని రెండు జిల్లాల జేడీఏలకు ఉత్తర్వులు జారీ చేశారు.

## 'నవోదయ' దరఖాస్తు గడువు పొడిగింపు

**లేపాక్షి:** జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11 తరగతుల్లో ప్రవేశం కోసం (2025–26 విద్యా సంవత్సరం) నిర్వహించే పరీక్షకు దరఖాస్తుకు గడువు పొడిగించారు. దరఖాస్తు చేయడంలో విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందులు, టెక్నికల్ సమస్యల కారణంగా ఈ నెల 19వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రస్తుతం 8వ తరగతి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## క్లుప్తంగా

### ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో జరుగుతున్న శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు శనివారం ముగిసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఖోఖోలో శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల (గుంతకలు), హ్యాండ్‌బాల్‌లో నారాయణ బిపెడ్ కళాశాల (తాడిపత్రి), ఫుట్‌బాల్‌లో మంగళకర కళాశాల (పుట్టపర్తి), రగ్బీ పోటీల్లో ఆర్ట్స్ కళాశాల (అనంతపురం) విజేతలుగా నిలిచాయని వివరించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ గోపాల్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ, బహుతులను అందజేసి అభినందిచారు.

### పట్టపగలే చైన్ స్నాచింగ్



బాధితురాలు రాములమ్మ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శారదానగర్‌లో పట్టపగలే చైన్ స్నాచింగ్ జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాంతినగర్‌కు చెందిన రాములమ్మ శనివారం ఉదయం శారదానగర్‌లోనున్న కూతురు ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా ఎదురుగా ముఖానికి మాస్కులు ధరించి వచ్చిన ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని 3.50 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఆమె గట్టిగా కేకలు వేసినా స్థానికులు వచ్చేలోపు దుండగులు అక్కడి నుంచి జారుకున్నారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, టూటౌన్ సీఐ రెడ్డప్ప, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి దొంగల కోసం గాలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### జిల్లాలో ఇద్దరికి నామినేటెడ్ పదవులు

అనంతపురం క్రైం: కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండో జాబితాను శనివారం విడుదల చేసింది. ఇందులో జిల్లా నుంచి ఇద్దరిని నామినేటెడ్ పోస్టులు వరించాయి. అనంతపురం – హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) చైర్మన్‌గా టి.సి.వరుణ్, ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్‌గా పూల నాగరాజు నియమితులయ్యారు.

# లఖ్‌పతి దీదీ.. ఏదీ?

☛ చిలమత్తూరుకు చెందిన ఒక స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ)లో సభ్యురాలైన మహిళ 'లఖ్‌పతి దీదీ యోజన' ద్వారా లబ్ధి పొందాలనుకుంది. ఈ పథకం ద్వారా శిక్షణ పొంది వడ్డీలేని రూ.5లక్షల రుణం వస్తే తన కాళ్లమీద తాను నిలబడి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆశిస్తోంది. ఏడాది పూర్తయినా పథకానికి నిధులు రాలేదని అధికారులు చెబుతూ వస్తుండడంతో ఆమె నిరుత్సాహానికి గురవుతోంది. 'లఖ్‌పతి దీదీ' ద్వారా లక్షాధికారులు కావాలని ఈమె లాంటి మహిళలు జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది ఎదురు చూస్తూ ఉన్నారు.

- రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణం ఉత్తిదే
- పథకం ప్రారంభించి 15 నెలలు పూర్తి
- జిల్లాలో ఎక్కడా అమలు కాని వైనం
- ఎస్‌హెచ్‌జీ మహిళల ఎదురుచూపు



కదిరి: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణనిచ్చి వారు స్వయం ఉపాధి పొందేలా 2023 ఆగస్టు 15న 'లఖ్‌పతి దీదీ యోజన'ను మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఈ పథకం అమలుకు కొన్ని నిధులు కూడా బడ్జెట్‌లో కేటాయిస్తున్నట్లు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ 2024 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఈ పథకం ద్వారా 3 కోట్ల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందని కూడా చెప్పారు. పేదరిక నిర్మూలన, స్వయం ఉపాధితో ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారు. దీని ద్వారా ఏడాదికి లక్ష రూపాయలకు పైగా సంపాదించేలా స్వయం ఉపాధికి అవకాశం కల్పిస్తారు. వీరికి వడ్డీ లేకుండా రూ.5 లక్షల వరకు రుణాలు ఇప్పిస్తారు. ఇంతటి బృహత్తర పథకం జిల్లాలో ఇప్పటిదాకా అమలుకు నోచుకోలేదు.

**లఖ్‌పతి దీదీ యోజనకు అర్హతలు..**

- ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళ కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదు.
- స్వయం సహాయక సంఘంలో సభ్యురాలై ఉండాలి.
- ప్రభుత్వ ఉద్యోగి లేదంటే ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా అర్హులు కాదు.
- 18 నుంచి 50 ఏళ్ల లోపు వయసు మహిళలు మాత్రమే అర్హులు.
- ఇక్కడ శాశ్వత నివాసి అయి ఉండాలి.

| జిల్లా వివరాలు | |
|---|---|
| మండలాలు | 32 |
| సచివాలయాలు | 544 |
| పంచాయతీలు | 467 |
| కుటుంబాలు | 6,09,316 |
| స్వయం సహాయక సంఘాలు | 33,411 |
| స్వయం సహాయక సంఘం సభ్యులు | 3,35,120 |

**లఖ్‌పతి దీదీ ప్రయోజనాలు..**

ఈ పథకం ద్వారా ఎంపికైన మహిళలకు ఎల్‌ఈడీ లైట్ల తయారీ, ప్లంబింగ్, పుట్టగొడుగుల పెంపకం, కుట్టు మిషన్ల మరమ్మతులు, పశుపోషణ, డ్రోన్ల రిపేరీ వంటి వాటిపై తగిన శిక్షణ ఇప్పిస్తారు. వ్యవసాయ రంగానికి మరింత సాంకేతికత జోడించేందుకు ఈరోజుల్లో డ్రోన్ల ఉపయోగమేంటో అందరికీ తెలిసిందే. పంటలకు నీటిపారుదల, మందుల పిచికారీకి డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ పథకం ద్వారా వర్క్‌షాప్‌లు, రుణ సౌకర్యాలు, బీమా కవరేజ్, స్కిల్ డెవలప్‌మెంట్, ఆర్థిక ప్రోత్సాహకాలు వంటి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయి.

**దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు..**

లఖ్‌పతి దీదీ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, స్వయం సహాయక సంఘంలో ఉన్నట్లు సభ్యత్వ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వయసు ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, మొబైల్ నంబర్ ఉండాలి. వీటిని తీసుకుని డీఆర్‌డీఏ శాఖకు చెందిన మండల ఏపీఓను సంప్రదిస్తే సరిపోతుంది.

**ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం..**



లఖ్‌పతి దీదీ పథకం ద్వారా రూ.5 లక్షలు వరకూ వడ్డీలేని రుణాలు తీసుకోవడానికి ఎంతో మంది డ్వాక్రా మహిళలు ఎదురు చూస్తున్నారు. ఈ పథకానికి నిధులు రాలేదని అధికారులు చెబుతున్నారు. మోదీ మహిళలను లక్షాధికారులను చేస్తామంటే సంతోషించాం. ఇప్పటిదాకా ఒక్కరిని కూడా లక్షాధికారిని చేసింది లేదు. వెంటనే ఈ పథకం అమలు చేయాలి.

– సుగుణమ్మ, ఓడీ చెరువు

**జీవనోపాధులే లక్ష్యంగా చర్యలు**



స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతతో పాటు జీవనోపాధుల కల్పనే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రతి మహిళా లక్ష రూపాయల ఆదాయం ఆర్జించేలా ఈ పథకం ద్వారా శిక్షణ అందించి, రుణాలు అందించేలా చూస్తాం. అయితే ఈ పథకానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది. రాగానే మహిళలను లక్షాధికారులనే చేసేందుకు మావంతు పాత్ర పోషిస్తాం.

–డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

### కూలీ శవం వెలికితీత

ధర్మవరం రూరల్: కట్టకిందపల్లి సమీపాన శుక్రవారం మోటర్ మరమ్మతు కోసం వ్యవసాయ బావిలోకి దిగి గల్లంతైన కూలీ దాసరి రామాంజనేయులు శనివారం శవమై తేలాడు. ఫైర్ సిబ్బంది, రూరల్ పోలీసులు 24 గంటలపాటు ఫైరింజన్‌తో నీరు తోడేసి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### 11 నెలలకు మృతుని ఆచూకీ లభ్యం



నాగరాజు (ఫైల్)

ధర్మవరం అర్బన్: రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి ఆచూకీని 11 నెలల తర్వాత కనుగొన్నారు. వేలిముద్రల ఆధారంగా వివరాలు కనుగొన్నారు. హిందూపురం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2023 డిసెంబర్ 28న ధర్మవరంలోని డీఎల్‌ఆర్ కాలనీ సమీపంలో రైలుకిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వేలిముద్రల నివేదిక ఈ నెల ఎనిమిదో తేదీన రైల్వే పోలీసులకు అందింది. ఆ వేలిముద్రలతో పోలీసు రికార్డుల్లో పరిశీలించి మృతుడు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామానికి చెందిన ఆకుతోట నాగరాజు(38)గా అంచనాకు వచ్చారు. తల్లి రామాంజినమ్మ, తమ్ముడు రామచంద్రను శనివారం రైల్వే స్టేషన్‌కు పిలిపించి మృతుని ఫొటోలు చూపించగా నాగరాజును గుర్తుపట్టారు. ఇతడు కళ్యాణదుర్గంలో 2008లో ఓ హత్య కేసులో జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుంచి బయటకు వచ్చాక ధర్మవరంలో బేల్దారి పనులు చేసుకుంటూ జీవించేవాడు. నాగరాజు కుమారుడు ఆంజనేయులు 2022లో జంగాలపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి మృతి చెందాడు. అప్పటి నుంచి ఒంటరి జీవితం భరించలేక మనోవేదనతో నాగరాజు కూడా రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు.

## ముగిసిన లీడర్‌షిప్, ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ



లీడర్‌షిప్ శిక్షణ ముగింపులో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈ నెల 4 నుంచి ప్రారంభమైన తొలివిడత లీడర్‌షిప్, రెండో విడత ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణలు శనివారంతో ముగిశాయి. రెండు శిక్షణలూ ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగాయి. నగర శివారులోని బళ్లారిరోడ్డు సీఆర్‌ఐటీలో జరిగిన లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల నుంచి మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు మొత్తం 249 మంది హాజరయ్యారు. బుక్కరాయసముద్రం సమీపంలోని విజయభారతి డీఎడ్ కళాశాలలో జరిగిన ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణకు అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి 235 మంది 1, 2 తరగతులు బోధించే ఎస్జీ టీచర్లు హాజరయ్యారు. లీడర్‌షిప్ ట్రైనింగ్ ముగింపు సందర్భంగా డీఈఓ ప్రసాద్ బాబు మాట్లాడుతూ శిక్షణలో భాగంగా నేర్చుకున్న అంశాలను మండలాలు, పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. నాయకత్వ లక్షణాలను తాము పాటిస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో పెంపొందింపజేయాలన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ ముగింపు సందర్భంగా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగరాజు మాట్లాడుతూ 1, 2 తరగతుల పిల్లల స్థాయికి వారితో మమేకమై బోధన చేయాలన్నారు. వివిధ రకాల బోధనా పద్ధతులను అవలంబించాలని, అప్పుడే చిన్న పిల్లలకు సులభంగా అర్థమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప విద్యాధికారి శ్రీనివాసులు, రాష్ట్ర పరిశీలకులు హైమేశ్వరరావు, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో డీఎస్పీ వెంకటేశులు, సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా

గార్లదిన్నె: ఉమ్మడి జిల్లాలో ద్విచక్ర వాహనాలు ఎత్తుకెళ్లే దొంగను గార్లదిన్నె పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి 24 బైక్‌లు రికవరీ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. సంజీవపురానికి చెందిన శంకర్ సాయికుమార్ అనే యువకుడు పదవ తరగతి వరకు చదువుకున్నాడు. జల్సాలకు అలవాటుపడి, ఇతరుల వద్ద అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చడానికి ద్విచక్రవాహనాల దొంగగా మారాడు. చోరీ చేసిన బైక్‌లను పలు ప్రాంతాల్లో తక్కువ ధరకు విక్రయించేవాడు. పలు పోలీస్ స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయి. రెండు రోజుల క్రితం గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరులో సంజీవరెడ్డి సర్కిల్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని శంకర్ సాయికుమార్ నకిలీ తాళంతో స్టార్ట్ చేసి కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాస్థానం సమీపంలో పాడుబడిన రేకుల షెడ్డులో దాచాడు. శుక్రవారం ధర్మవరానికి చెందిన తిరుపాల్ అనే వ్యక్తి కల్లూరులో పార్కింగ్ చేసిన తమ ద్విచక్రవాహనం చోరీ అయ్యిందని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. రేకులషెడ్‌లోని బైక్ తీసుకుని బెంగళూరులో అమ్మాలని వెళ్తుండగా సమాచారం అందుకున్న సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా, పోలీస్ ప్రత్యేక బృందం సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడు శంకర్ సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. అనంతపురం, గార్లదిన్నె, నార్పల, శింగనమల, నంద్యాల, ధర్మవరం, ఆదోని, బాగేపల్లి ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. అతనిచ్చిన సమాచారం మేరకు 24 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని శనివారం అనంతపురం కోర్టులో హాజరుపరిచారు. బైక్‌ల రికవరీలో పాల్గొన్న పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

### 'తమ్ముళ్ల' నడుమ పేకాట చిచ్చు

తాడిపత్రి టౌన్: తాడిపత్రిలో 'తమ్ముళ్ల' నడుమ పేకాట చిచ్చు రేపింది. పేకాట స్థావరం నిర్వహించినందుకు వసూలు చేసిన డబ్బు పంపకాల విషయంలో వివాదం తలెత్తింది. వర్గాలుగా ఏర్పడి కొట్టుకునే వరకూ వెళ్లారు. వివరాలు.. తాడిపత్రిలోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో ఓ టీడీపీ నేత పేకాట స్థావరం నిర్వహిస్తున్నాడు. సుంకులమ్మపాలెంకు చెందిన సురేష్, రెడ్డివారిపాలెంకు చెందిన విశ్వనాథ్ అనే టీడీపీ కార్యకర్తలు పేకాటరాయుళ్లను పోగు చేసి ఇక్కడికి తీసుకొచ్చేవారు. పేకాట స్థావరం నిర్వహణ ద్వారా వచ్చిన ఆదాయం పంచుకోవడంలో శుక్రవారం వీరిద్దరి మధ్య వివాదం చెలరేగింది. ఈ క్రమంలోనే తమ తమ కాలనీలకు యువకులను పెద్ద సంఖ్యలో పోగు చేసుకొని ఒకరిపై ఒకరు దాడులకు సిద్ధమయ్యారు. అయితే, ముందస్తు సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకోవడంతో అందరూ పారిపోయేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు విశ్వనాథ్‌ను పట్టుకుని స్థానిక స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం బయటకు పొక్కకుండా గుట్టుగా విచారణ చేస్తున్నారు. దీనిపై సీఐ సాయిప్రతాప్‌ను వివరణ కోరగా.. బార్‌లో బిల్లు కట్టే విషయంలో సురేష్, విశ్వనాథ్ మధ్య గొడవ చెలరేగినట్లు తెలిపారు. దీంతో రెండు రోజులుగా ఆయా కాలనీల్లో గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఇద్దరూ తమ అనుచరుల కూడగట్టుకుని గొడవ పడేందుకు సిద్ధమవుతుండగా దాడులు నిర్వహించామన్నారు. సురేష్ ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడని, విశ్వనాథ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సమస్య తెలిపాడన్నారు. అలాగే కూరగాయల మార్కెట్ సమీపంలో టీడీపీ నేత కూడా అందుబాటులో లేడని తెలిపారు. కాగా, సురేష్, విశ్వనాథ్ గతంలో పేకాట ఆడిస్తూ పట్టుబడి పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది.

### పశువుల కంటైనర్ పట్టివేత



కంటైనర్‌లో ఉన్న పశువులు

పెద్దవడుగూరు/ పామిడి : పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్‌ను కేశేపల్లి టోల్‌గేట్ వద్ద శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు నుంచి పశువులతో వస్తున్న కంటైనర్‌ను పెద్దవడుగూరు మండలం కేశేపల్లి టోల్‌గేట్ వద్ద ఓ పాత్రికేయుడు గమనించి పోలీసులకు సమాచారమందించారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకు పరిశీలించగా 30 ఎద్దులను గుర్తించారు. విచారణ చేయగా... ఆదివారం అనంతపురంలో జరిగే సంతకు తీసుకెళ్తున్నట్లు పశువులను తరలిస్తున్న వారు తెలిపారని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. అనుమతులు లేకుండా తరలిస్తున్నందున వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.



### రోడ్డు ప్రమాదంలో టెక్నీషియన్ దుర్మరణం



విజయ్‌కుమార్ (ఫైల్)

పెనుకొండ: రోడ్డు ప్రమాదంలో కంప్యూటర్ టెక్నీషియన్ విజయ్‌కుమార్ (38) దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పెనుకొండకు చెందిన విజయ్‌కుమార్ శనివారం ఉదయం స్నేహితుడు నందికేశ్వరరెడ్డితో కలిసి పని నిమిత్తం ద్విచక్రవాహనంపై హిందూపురం వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా దొడ్డికుంట సమీపంలోని పంపు హౌస్ వద్ద బైక్ అదుపుతప్పడంతో జాతీయరహదారి పక్కన పడిపోయారు. తీవ్రగాయాలైన విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన నందికేశ్వరరెడ్డిని స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి ప్రమాద స్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విజయ్‌కుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. విజయ్‌కుమార్ గతంలో పలు పత్రికల్లో విలేకరిగా పనిచేశారు.

### ఇదీ అమ్మ ప్రేమంటే!



ఆ ఇల్లాలు ఏదో పనిమీద తన ఇద్దరు పిల్లలతో ద్విచక్రవాహనంపై బయటకు వచ్చింది. అయితే ఆ పిల్లలు బైక్‌పైనుంచి జారి కిందపడకుండా చున్నీతో నడుముకు కట్టుకుంది. పిల్లల పట్ల ఆమె తీసుకున్న జాగ్రత్తలను పలువురు ఆసక్తిగా తిలకించారు. తల్లి తన పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటుంది అనడానికి ఇదొక నిదర్శనంగా నిలిచింది. శనివారం అనంతపురం క్లాక్‌టవర్ వద్ద ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

## ఆ ఇంటి అల్లుడే దొంగోడు

- కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ధర్మవరం రూరల్: బంగారు ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీ చేసిన వ్యక్తి ఆ ఇంటి అల్లుడే అని తేల్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనివాసులు మీడియాకు వెల్లడించారు. ఈ నెల ఐదో తేదీన గొట్లూరు ఎస్సీ కాలనీలో నివాసముంటున్న సాకే ఓబులమ్మ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలోని 6.5 తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ రత్న, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రభాకర్ సూచనలతో చోరీ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేపట్టారు. చోరీ జరగడానికి ముందు అక్కడ ఎవరెవరు సంచరించారు అన్న వివరాలు సేకరించిన పోలీసులకు ఆ ఇంటి అల్లుడి గురించి తెలిసింది. అనుమానితుడి కింద ఆరా తీశారు. అప్పుడు అసలు విషయం వెలుగుచూసింది. ఓబులమ్మ పెద్ద కూతురు పుష్పాంజలిని పదేళ్లక్రితం ధర్మవరం పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన చందమామ రవికి ఇచ్చి వివాహం జరిపించింది. మూడేళ్లపాటు వీరి కాపురం అన్యోన్యంగా సాగింది. అనంతరం ఇద్దరి దంపతుల మధ్య గొడవలు రావడంతో విడిపోయారు. అప్పటి నుంచి పుష్పాంజలి గొట్లూరులోని తల్లి వద్దే ఉండేది. అల్లుడు చందమామ రవి చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో తన అత్తగారింట్లోనే చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రవి ఇంటి తలుపులను పగులగొట్టి బీరువాలోని బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు కేసును ప్రత్యేకంగా తీసుకొని విచారణ చేపట్టారు. అందులో భాగంగా ఎస్‌ఐ తన సిబ్బందితో వెళ్లి నాగలూరు బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా వున్న చందమామ రవిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసును ఛేదించిన రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులను, పోలీస్ సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ, సీఐలు అభినందించారు.

## ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత








గాండ్లపర్తి శివానందరెడ్డి, హరినాథ్, నరసింహమూర్తి, శచీదేవి, కరియన్న, నీలోఫర్ జాన్

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ (ఎస్‌ఎల్‌టీఏ) ఆంధ్రప్రదేశ్ కమిటీలో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత లభించింది. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపురం జిల్లాకు చెందిన గాండ్లపర్తి శివానందరెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఉపాధ్యక్షులుగా బి.నరసింహమూర్తి, కే శచీదేవి, కార్యదర్శిగా నీలోఫర్ జాన్, ఆడిట్ కమిటీ కన్వీనర్ గా ఎం.హరినాథ్, లీగల్ కమిటీ సభ్యులుగా ఎం.కరియన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో సముచిత స్థానం కల్పించినందుకు అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు వై.ఆదిశేషయ్య, జి.వేణుగోపాల్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ఆనందరెడ్డి, రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. భాషా పండితుల సమస్యలు పరిష్కరించాలని, 117 జీవో రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, పీఆర్సీ కమిషన్ పూర్తి స్థాయిలో నియమించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో రాయడానికి అవకాశం కల్పించాలని కోరారు.

## గ్లోబల్ అఖండ భజన ప్రారంభం



అఖండ భజన చేస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: ప్రపంచశాంతిని కాంక్షిస్తూ శనివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధి చెంత గ్లోబల్ అఖండ భజన ప్రారంభమైంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సత్యసాయి సెంటర్లలో అఖండ భజనను సత్యసాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్నాయి. సత్యసాయిని కీర్తిస్తూ భక్తులు నిర్వహించిన భజనతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు అఖండ భజన ముగియనుంది